ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 22 డిసెంబరు 2024 | 5

గోవిందా..గోవింద

మామిడికుదురు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి తొలి హారతి ఇవ్వగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. వివిధ ఆర్జితసేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా స్వామివారికి రూ.2,35,662 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంఎస్ రాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏఈ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారికి ప్రత్యేక పూజలు

అల్లుకున్న నిర్లక్ష్యం..





మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లి జగనన్న లేఅవుట్‌లో ఓ ఇల్లు..

(ఆంధ్రజ్యోతి, మండపేట)

నమ్మండి ఇది జగనన్న ఇల్లే... మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లిలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇంటికి అల్లుకున్న నేతి బీరపాదు ఇది.. వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్లపై ఎంత ప్రేమ చూపించారో అర్థం చేసుకోవడానికి ఈ ఒక్క ఫొటో చాలు.. ఓ లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం నిలిచిపోవటంతో ఇలా పిచ్చి మొక్కలు, పాదులతో నిండిపోయింది. ఇలాంటి దృశ్యాలు ఈ కాలనీలో చాలా కనిపిస్తాయి..

గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్షునిగా గుబ్బల శ్రీనివాస్.. ఉపాధ్యక్షునిగా కరుటూరి



ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శ్రీనివాస్, నరసింహారావుకు అభినందనలు

అమలాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి మధ్య డెల్టా నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జల వనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా అన్యం రాంబాబు వ్యవహరించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష స్థానానికి గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కరుటూరి నరసింహారావు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ నెల 14న జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టా పరిధిలోని 83 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించామన్నారు. వీటిలో గోదావరి మధ్య డెల్టా పరిధిలో 56 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, జిల్లాలో 15 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా గోదావరి మధ్య డెల్టాకు సంబంధించి పది డిస్ట్రిబ్యూటరీ సంఘాలు ఉన్నాయన్నారు. గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీకి సంబంధించి పది సంఘాల ప్రతినిధులు ఎన్నికల్లో పాల్గొన్నారని శ్రీనివాసరావు వివరించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కరుటూరి ఎన్నిక కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు కలెక్టరేట్ వద్ద శుభాకాంక్షలు తెలిపారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తికావడంతో సాగునీటి వ్యవస్థకు తిరిగి జవసత్వాలు వచ్చాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారిని కోరారు. శివారు ప్రాంత భూములకు సైతం సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ప్రాధాన్యం ఇచ్చిందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. రైతు సంక్షేమమే పరమావధిగా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికల చివరి ఘట్టం ముగిసిందన్నారు. అభినందించిన వారిలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులను క్రమపద్ధతిలో పరిష్కరించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెవెన్యూ డివిజన్లు, మండలస్థాయిలో ప్రజా ఫిర్యాదులను క్రమ పద్ధతిలో పరిష్కరించేందుకు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున అందిన అర్జీలకు నూరుశాతం పరిష్కార మార్గాలు నాణ్యతతో చూపాలన్నారు. డివిజన్, మండలస్థాయి అధికారులు ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతోను, తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండలస్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించాలన్నారు. అర్జీలు స్వీకరించేందుకు ఉదయం 9 గంటలలోపే అధికారులు పీజీఆర్ఎస్ వేదికల వద్దకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

కుప్పకూలిన ఓఎన్జీసీ ప్లాంటు డ్రైన్

రూ.12 కోట్లు వృథా

ఓడలరేవును వీడని ముంపు బెడద

ఓఎన్జీసీ ఇంజనీర్ల నిర్లక్ష్యంపై విమర్శలు



అల్లవరం మండలం ఓడలరేవులో రూ.12 కోట్లతో నిర్మించిన ఓఎన్జీసీ డ్రైన్ కుప్పకూలి పాడైన దృశ్యం

అల్లవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో చమురు సహజ వాయివు ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచిన అల్లవరం మండలం ఓడలరేవులో టెర్మినల్స్(ప్లాంట్లు) చుట్టూ రూ.12 కోట్ల ఓఎన్జీసీ నిధులతో నిర్మించిన డ్రైనేజీ సిస్టమ్ ప్రారంభించకుండానే కుప్పకూలిపోయింది. ఓఎన్జీసీ అధికారులు పర్యవేక్షణ కొరవడి ఇంజనీర్ల ముందుచూపు లేక నీరు దిగే ప్రణాళికతో డ్రైన్ నిర్మించకపోవడం వల్లే రూ.12 కోట్ల నిధులు దుర్వినియోగమై డ్రైన్ పనికిరాకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓడలరేవులో ఓఎన్జీసీ రైతుల నుంచి 370 ఎకరాల భూమిని తీసుకుని మూడు దశలలో మూడు టెర్మినల్స్ నిర్మించారు. అయితే ఓఎన్జీసీ తీసుకున్న భూముల పరిధిలో గతంలో గాల్ల (నీరుపాయే పాయల) ద్వారా వైనతేయ గోదావరిలోకి ముంపు నీరు దిగేది. టెర్మినల్స్ నిర్మించడంతో ముంపు నీరు దిగేలా ఓఎన్జీసీ ప్రహరీ చుట్టూ బయట ఐదు కిలోమీటర్ల పొడవునా ఆరేళ్ల క్రితం భారీ ప్రాజెక్టుగా డ్రైన్ నిర్మించారు. కొన్ని చోట్ల రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో నిర్మాణ పనులకు ఆటంకాలు ఎదురయ్యాయి. ఆ తర్వాత సముద్రంలో ముంపు దిగేలా నిర్మించిన డ్రైన్‌ను ప్రారంభించకుండానే పలు చోట్ల కూలిపోయి ఇసుక మేటతో కప్పిపోయింది. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్స్ చుట్టూ రైతుల జిరాయితీ భూములలో ముంపు నీరు దిగక చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఓఎన్జీసీ అధికారుల పర్యవేక్షణ లేక ఇంజనీర్ల వైఫల్యంతో డ్రైయిన్ నిర్మాణానికి ఖర్చు చేసిన రూ.12కోట్ల నిధులు గంగపాలయ్యాయి. డ్రైన్ నిర్మాణంలో అక్రమాలపై దర్యాప్తు జరిపి ముంపు నీరు దిగడానికి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. ముంపు దిగక సరుగుడు, కొబ్బరితోటలు దెబ్బతిన్నాయని తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, ఓఎన్జీసీ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో గ్రామస్థుల ఆందోళనల నేపథ్యంలో డ్రైన్ నిర్మించిన ఫలితం లేకుండా పోయింది. రూ.12 కోట్లతో నిర్మించిన ఐదు కిలోమీటర్ల పొడవైన డ్రైన్ కుప్పకూలి నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలిచింది. డ్రైన్ నిర్మాణంలో అవకతవకలపై దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ముంపు నీటిలో పొలాలు

తీరు మారాలి

మీరున్నది కూటమి ప్రభుత్వంలో..

- అధికారులు మారకపోవడంపై ఆగ్రహం
- ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారా?
- రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా?
- నియోజకవర్గాల్లో సమస్యలపై ఏకరువు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో నాయకుల మండిపాటు



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ,కలెక్టర్ షాన్‌మోహన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి); కాకినాడసిటీ: "ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదు.. ఇంకా వైసీపీ ప్రభుత్వంలోనే ఉన్నామనుకుంటున్నారు..కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్నామనే సంగతి అధికారులు తెలుసుకోవాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో రకంలా నిబంధనలు ఎలా అమలు చేస్తారు" అంటూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. కాకినాడ రూరల్ వాకలపూడిలో పారిశ్రామిక కాలుష్య బుగ్గితో ప్రజలు నరకం చూస్తున్నారు. ఒక్కరోజు ఇంట్లో లేకపోతే బుగ్గి ఇళ్లల్లో పేరుకుపోతోంది. అటు నియోజకవర్గంలో అనేక చోట్ల కాలువలు కనిపించడం లేదు..అధికారులు వెదికి పెట్టాలి అంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులకు చురకలంటించారు. వెరసి అధికారుల తీరుపై అధికార పక్ష ఎమ్మెల్యే ఆగ్రహాల మధ్య కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమా వేశానికి మంత్రులెవరూ రాకపోవడంతో ముమ్మిడివరం టీడీపీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విప్ హోదాలో సమావేశాన్ని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆది నుంచే వాడివేడిగా..

వ్యవసాయం, జలవనరులు, వైద్య ఆరోగ్యం, డ్వామా, డీఆర్‌డీఏ, ఉచిత ఇసుక విధానం తదితర అంశాలపై చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాలో రైతులకు రబీ సాగులో నాణ్యమైన విత్తనాలు, సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు రబీకి సాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని సమావేశం నిర్ణయించింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ రబీలో రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందన్నారు. కానీ అధికారులు పాత విధానంలోనే ఉండిపోయారని.. పేరు మార్పుపై క్షేత్రస్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా రైతులు తమకు ఇష్టం వచ్చిన రైస్ మిల్లులకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కానీ అధికారులు మాత్రం రూల్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు చర్చించేందుకు జడ్పీ సమావేశం చక్కని వేదిక అని పేర్కొన్నారు. అటు ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను ఒకసారి పర్యవేక్షించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు సూచించారు.జలజీవన్ మిషన్ కింద ఎక్కడెక్కడో భూగర్భజలాలు తీసి తోడడానికి బదులు పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే విషయమై అధికారులు అధ్యయనం చేయాలని కోరారు.

కాలువపై..పేకాట క్లబ్బా..

ఇరిగేషన్ కాలువను కప్పెట్టేసి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు పేకాట క్లబ్ కట్టాడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కొన్ని ఇరిగేషన్ కాలువలు మాయమైపోయామని, అధికారులు మాత్రం కాగితాల్లో వాటిని చూపుతున్నారన్నారు. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయో వెదికి చూపించాలని అధికారులకు చురకలంటించారు.రూరల్‌పరిధిలో వివిధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల ప్ర జలు శ్వాసకోస సమస్యల భారినపడుతున్నా రన్నారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ చుట్టుపక్క పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంపై ఇప్పటికే శాంపిళ్ల సేకరించి పరిశీలనకు పంపామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.కాకినాడ రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ వాకలపూడి ప్రాంతంలో ప్యారీషుగర్స్ నుంచి వచ్చే కాలుష్యంతో నరకం చూస్తున్నామన్నారు. తన నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు.తాగు,సాగు నీరు కాలుష్యం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మండిపడ్డారు.వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైనేజీ కాలువల్లో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదలకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కేజీ బేసిన్ నుంచి గ్యాస్ చమురు తరలించుకుపోతున్న కంపెనీలు రాయల్టీ ఏపీకి కట్టడం లేదని, కట్టించేలా సభలో తీర్మానం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలి..

జడ్పీ పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉచిత ఇసుక ప్రయోజనం చేకూర్చే విధంగా చూడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. ఇకపై సమావేశాలు సమయానికి జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలంతా కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న ఏకైక శాఖ పంచాయతీరాజ్ అని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. కీలక అంశాలపై నాయకులు చేసిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు.సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చినరాముడు, చింతూరు ఐటీడీఏ పీవో అనూర్వ భారత్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె . మాధవి, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డిప్యూటీ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్, ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర నాయకులు

పడవ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ ముందుగా నిర్వహించే కేరళ తరహా పడవ పోటీలను విజయవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆత్రేయపురం కాలువ రేవులో సంక్రాంతి పడవ పోటీలు నిర్వహిస్తున్నారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ బహుమతులను కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే సత్యానందరావు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. జనవరి 11, 12, 13 తేదీలలో పడవ పోటీలు ముత్యాల రంగవల్లులు, ఈత పోటీలు, పతంగులు ఎగురవేయడం తదితర కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పోటీలను అందరి భాగస్వామ్యంతో సంక్రాంతి పండుగ కళకళలాడేలా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం చిన్నారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీవోలు పడవపై విహరించారు. అనంతరం ట్రోఫీ ప్రోమోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్లపూడి భాస్కరరావు, గెడ్డం సుధ, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.



కన్నీళ్లు మిగిల్చింది.. వివరాలు 6లో..



కొబ్బరి ధర పెంపు వివరాలు 7లో..



ఐటీ చూస్తోంది.. ప్రత్యేక కథనం..6లో

ఏమీ అర్థం కావడంలేదు.. నిన్నటి వరకూ మా మధ్యనే ఎంతో చలాకీగా తిరిగింది.. ప్రతి రోజూ ఏనుగును చూసేవాడిని.. రేపటి నుంచి కనబడదంటే తట్టుకోలేక పోతున్నాం.. కన్నీటి పర్యంతమవుతూ ఒక పెద్దాయన అన్న మాట..ఆ గ్రామంలో ప్రతి ఒక్కరిదీ ఇదే పరిస్థితి.. ఎందుకంటే ఒకటా రెండా ఏకంగా 19 ఏళ్ల అనుబంధం.. ఏనుగును ఇంట్లో మనిషిలా చూస్తారు..వారు వండుకున్నదే పెడతారు.. అయినా ఏం మాట్లాడదు.. పెట్టింది తిని ఆశీర్వదించి వెళ్లిపోతోంది.. రేపటి నుంచి ఎవరి వద్ద ఆశీర్వాదం తీసుకోవాలని మరొక పెద్దావిడ కన్నీటి పర్యంతమైంది. శనివారం రఘుదేవపురంలో ఎవరిని కదిపినా ఇదే పరిస్థితి.. ఏనుగు మృతితో ఊరంతా బోరుమని ఏడ్చింది.. ఠీవిగా నడిచి వెళ్లే ఏనుగు.. జీవశ్చవంగా వెళుతుంటే తట్టుకోలేకపోయారు.. సమాధి వరకూ ర్యాలీగా వెళ్లి తుది వీడ్కోలు పలికారు..

ఇక ఎవరు ఆశీర్వదిస్తారు!



ఏనుగు మృతితో రఘుదేవపురంలో విషాదఛాయలు

- కన్నీటి పర్యంతమైన గ్రామస్తులు
- తండోపతండాలుగా వచ్చిన జనం
- రేపటి నుంచి ఎలా అని ఆవేదన
- పెదకొండేపూడిలో ఖననం
- ర్యాలీగా వెళ్లిన జనం
- అజీర్తా.. గుండెపోటా?

రాజమహేంద్రవరం/సీతానగరం, డిసెంబరు 21 ఆంధ్రజ్యోతి : ఏనుగును చూస్తే ఎవరైనా భయపడతారు.. ఆ గ్రామంలో మాత్రం దాని దగ్గరకు వెళ్లి ఆశీ ర్వాదం తీసుకుంటారు. మిగిలిన జంతువులు రోడ్డుపై ఎలా వెళ్లిపోతాయో.. ఏనుగు అంతే.. ఇదెక్కడో మారుమూల కాదు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో పరిస్థితి.. నిన్నటి వరకూ ఆ ఏనుగు జనంతో మమేకమై నడిచింది.. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత కన్నుమూసింది.దీంతో మన జిల్లాలోనూ ఒక ఏనుగు ఉం దని ప్రపంచానికి తెలిసింది.ఆ ఏనుగును చూసేందుకు తండోప తండాలుగా జనం తరలివ చ్చారు. విగతజీవిగా పడి ఉన్న గజేంద్రుడిని చూసి చలించిపోయారు. లేమ్మా అంటూ లేప డానికి ప్రయత్నించారు. అయినా కదలికలేదు. ఏనుగులు 70-80 ఏళ్ల పాటు జీవిస్తాయి. కానీ 'లీలావతి' 18 ఏళ్లకే కన్ను మూయడం ఆ గ్రామస్తులను కలచి వేసింది.అటవీశాఖ అనుమతి మేరకు శనివారం సాయంత్రం పెదకొండేపూడి గ్రామంలోని చిట్టి బాబాజీ ఆశ్రమానికి చెందిన గోసాల సమీపంలో సమాధి చేసి అంత్యక్రియలు నిర్వహించారు. బాజా భజంత్రీల మధ్య లీల మృతదేహాన్ని పెద కొండేపూడి తీసుకెళ్లారు

2 గంటలు మృత్యువుతో పోరాడి..

ఆ మూగజీవి తన ప్రాణాలు ఎవరైనా కా పాడ తారని చివరి క్షణం వరకూ కొట్టు మిట్టాడినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. అజీర్తి వల్ల ఎక్కువగా ఇబ్బంది వస్తే కడుపు నొప్పి విపరీతంగా వస్తుంది. ఆ సమయంలో ఏనుగు ప్రవర్తన మారిపోతుంది. కళ్లలోంచి నీళ్ల వస్తాయి. శరీరం లోపల గ్యాస్ పట్టేయడం వల్ల అరవడానికి చాలా ఇబ్బంది అవుతుంది. దీంతో తొండాన్ని నేలపై కొడతాయి. లీలావతి కూడా ఇలా చేసినట్టు తెలుస్తోంది. ఆమ్లాల ఉత్పత్తి అధికం కావడంతో కడుపులో ఫర్మెంటేషన్ బ్యాక్టీ రియా చనిపోయి విపరీతంగా గ్యాస్ పుడు తుంది. అలాంటి సమయంలో కూడా కనీసం రెండు గంటలపాటు తీవ్రంగా ఇబ్బంది పడుతుం ది. అప్పటికీ పట్టించుకోకపోతే అకస్మాత్తుగా కిందపడిపోయి ప్రాణాలు విడుస్తుంది. ఇప్పుడు లీల విషయంలో కూడా అదే జరిగిందా? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. రాత్రి సుమారు 9 గంటల నుంచి చాలా ఇబ్బంది పడి 11.30 గంటల సమయంలో కింద పడిపో యింది. గంట తర్వాత 12.25 గంటలకు తుదిశ్వాస విడిచింది.సాధారణంగా మనిషికి రోజుకు 10 కిలోల వరకూ గ్యాస్‌వాయువులు ఉత్పత్తి అయితే..ఏనుగులకు అంతకు పదింతలు అవుతుంది.

అసలేం జరిగింది?

లీల శుక్రవారం రాత్రి 7.30గంటల సమ యంలో బాగానే ఉంది. రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కింద పడిపోవడంతో దాని బాగోగులు చూసే మావటిలు తిరు చూర్‌లోని వైద్యుడికి ఫోన్ చేశారు. స్థానిక వైద్యులను వెంటనే రప్పించాలని ఆయన సలహా ఇచ్చారు. స్థానిక వైద్యుడు వచ్చేసరికే లీలావతి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. తొండం అచేతనమైపోయింది. చెవులు నెమ్మదిగా ఊగుతున్నాయి.కళ్లల్లో జీవం దాదాపుగా పోయింది. డాక్టరు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.లీల మరణ సమయానికి 4 టన్నుల బరువు ఉంది.అది సాధారణ బరువే. ఈ వయసులో ఇవి రోజుకు 60 కిలోల వరకూ తింటాయి.అయితే ఈ ఏనుగు మరణానికి సివియర్ ఎసిడోసిస్ కారణంగా తెలుస్తోంది. ఈ జంతువు తిని అరిగించుకునేవి కాకుండా భక్తులు ఇష్టానుసారం అన్నం, ఇడ్లీలు వంటివి పెట్టడంతో అజీర్తి చేసి.. కడుపులో లాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి ఎక్కువై గ్యాస్ అధికంగా విడుదలయ్యే అవకాశం ఉంది.అలా జరిగితే ఊపిరితిత్తులకు గాలి సర ఫరా నిలిచిపోయి వాటితో పాటు, గుండె ఆగిపోయి మరణిస్తాయి.

2009 నుంచి ఇక్కడే..

ఏనుగులు దేవాలయాల్లో, ఆశ్రమాల్లో ఉండ డం కొత్త కాదు. మనకు తక్కువ గానీ కేరళ, తమిళనాడులో దాదాపు ప్రతి ప్రఖ్యాత దేవాలయంలో ఏనుగులు భక్తులకు ఆశీర్వాదాలను అందిస్తూ వారిచ్చిన దక్షిణను ఒడుపుగా తొం డంతో అందుకుంటాయి.మన జిల్లాలోనూ నిన్నటి వరకూ అటువంటి ఆశ్రమం ఒకటి ఉండేది. ఆ ఆశ్రమానికి వెళితే ఏనుగు ఆశీర్వదించేది.. 2009వ సంవత్సరం ఆగస్టు 10వ తేదీన అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జార్జిఖండ్ సీతానగరం మండలం రఘుదేవపురంలోని సద్గురు శ్రీ చిట్టిబాబాజీ సంస్థానం చారిటబుల్ ట్రస్ట్‌కు 3.5 ఏళ్ల వయసున్న ఏనుగును బహూకరించారు. ఏనుగుకు లీల అని నామకరణం చేశారు.దీనికి ప్రత్యేకంగా ఒక భవనం కూడా నిర్మించారు. అందులోనే మావటిలు ఉండేవారు. ప్రస్తుతం దాని వయస్సు 19 సంవత్సరాలు. మావటిలు ప్రతి రోజూ తెల్లవారుజామున గోదావరి నది స్నానానికి తీసువెళ్లేవారు. తిరిగి వస్తూ మార్గమధ్యంలో భక్తులు పెట్టిన పండ్లు, స్వీట్లు, బ్రెడ్లు ఎవరికి తోచినది వారు తినిపించి లీల ఆశీర్వాదం తీసుకునేవారు.చిన్నతనం నుంచి గ్రా మంలోనే ఉండడంతో గ్రామస్తులను ఎంతో మచ్చిక అయ్యింది.రేపటి నుంచి లీల ఆశీర్వాదం దొరకదన్న వార్త స్థానికులను కలచివేస్తోంది. గ్రామస్తులకు కన్నీళ్లు మిగిల్చింది.



ఏనుగు మృతదేహంపై పూలు చల్లుతున్న ఎమ్మెల్యే



రఘుదేవపురంలో అటవీ అధికారుల విచారణ

మృతిపై విచారణ చేస్తున్నాం..

ఇప్పుడు చనిపోయిన ఏనుగు వయసు 18 ఏళ్లు. ఆశ్రమం మనోభావాలకు అనుగుణంగా నిబంధనల ప్రకారం ఖననం చేస్తాం. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని పాటిస్తాం. మరణానికి కారణాలపై విచారణ మొదలు పెట్టాం. వైద్యుల ప్రాథమిక అంచనా ప్రకారం గుండెపోటుగా భావిస్తున్నాం. పోస్టుమార్టం రిపోర్టు 10 రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ఆ రిపోర్టు ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రవీంద్ర ధామా, తూర్పు అటవీ అధికారి

ఇలా చేస్తే బతికేదేమో!

ఏనుగు ఒక కేజీ తినేసోడాను ఐదారు లీటర్ల నీటిలో కలిపి పట్టించాలని వైద్యులు చెబుతున్నారు.తినేసోడా అందుబాటులో లేకపోతే కనీసం ఉప్పు నీళ్లయినా పట్టించాలని అంటున్నారు. అలా చేస్తే జీర్ణ వ్యవస్థ కుదుట పడుతుంది. లీలావతి విషయంలో కూడా ముందుగా దానికి గమనించి తినేసోడా లేదా ఉప్పు నీళ్లు పట్టిస్తే డాక్టరు వచ్చే వరకైనా ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రోజూ బ్రెడ్ పెట్టేవాడిని..



లీల రాగానే రోజూ ఉదయం షాపులోని బ్రెడ్ పెట్టి ఆశీర్వాదం తీసుకునే వాడిని.. బ్రెడ్ తిన్నాక తొండం తలపై పెట్టి ఆశీర్వదించేది. లీలకు ఆహారం పెడితే వ్యాపారం బాగుంటుందనేది నమ్మకం. లీల మరణించిందన్న వార్త బాధ కలిగించింది. **- అల్లు నరసింహామూర్తి, స్వీట్స్ షాపు యజమాని**

చాలా బాధగా ఉంది..



ఏ పని ప్రారంభించినా లీల ఆశీర్వాదం తప్పనిసరి.. నేను పనిమీద వెడుతున్నాను. శుభం కలగాలని కోరుకునే వాడిని, నా పనులు విజయవంతంగా పూర్తయ్యేవి. ఇప్పుడు లీల మరణించిందని తెలిసి చివరిసారిగా చూసాను.చాలా బాధ అనిపించింది

- మారుతి సాయిచంద్, సీతానగరం

అరటి పండ్లు పెట్టేవాడిని..



నేను రోజూ ఏనుగుకు అరటి పండ్లు పెడితే తిని ఆశీర్వదించేది. లీలకు ఏ రోజైనా పండ్లు పెట్టకపోతే మనశ్శాంతిగా ఉండేది కాదు.దానికి ఆహారం పెట్టి ఆశీర్వాదం తీసుకునేవాళ్లం. ప్రతి రోజూ ఉదయం లీల ఎప్పుడు వస్తుందా అని చూసేవాళ్ళం

- మురకొండ రామకృష్ణ , పండ్ల వ్యాపారి

టిఫిన్ పెడితే తినేది..



లీల (ఏనుగు) అంటే మాకు సెంటిమెంట్. రోజూ ఉదయం షాపు వద్దకు రాగానే మా హోటల్లో చేసిన టిఫిన్స్ తలో రకం పెట్టేవాళ్లం ఆ టిఫిన్ తిని మమ్మల్ని ఆశీర్వదించేది. రోజు దాని రాకకోసం ఎదురుచూసేవాళ్లం .. ఏనుగు రాకపోతే మాకు డల్‌గా ఉండేది.

- కుంచే సాయి, హోటల్ యజమాని



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తులు



వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.53 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలతో స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించి తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38,53034 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

సత్యదేవా నిత్యాన్నదానం ట్రస్ట్‌కు రూ.3.44 లక్షల విరాళం





ఈవోకు రూ.2.44 లక్షలవిరాళం అందజేస్తున్న వీర్ల సూరిబాబు బ్రదర్స్, రూ 1,11,116 విరాళం అందజేస్తున్న గుమ్మడి గురునాధరావు

అన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం ఇద్దరు దాతల నుంచి రూ 3.44 విరాళంగా సమకూరాయి. అన్నవరంనకు చెందిన వీర్ల సూరిబాబు, చక్రరావు, రాము సోదరులు రూ 2,44,348 విరాళంగా సమర్పించగా విశాఖపట్నంనకు చెందిన గుమ్మడిగుర్నాధరావు రూ.1,11,116 అందించారు. దాతలు వేర్వేరుగా ఈ మొత్తాలను ఈవో వీర్ల సుబ్బారావుకు అందించగా దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై బాజాభజంత్రీల నడుమ తోడ్కొనివచ్చి తూర్పు రాజగోపురం ఎదురుగా అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రావులపాలెం సీఆర్సీలో కబడ్డీ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోషియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో 22, 23, 24, 25 తేదీలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగోరి వెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. రావులపాలెం సీఆర్సీ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభి స్తామన్నారు. స్థానిక సీఆర్సీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఉత్తరాఖాండ్‌లో జరిగే నేషనల్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీఆర్సీ ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరక్టర్ నల్లమిల్లి వీరరాఘవ రెడ్డి, చిర్ల కనికిరెడ్డి పాల్గొన్నారు.



ఐటీ చూస్తోంది..

- ఆదాయపు పన్ను శాఖ ఆపరేషన్స్ వెరీ స్పెషల్

వివిధ కోణాల్లో ఆరా..రైడ్స్

- పెద్దాపురం(ఆంధ్రజ్యోతి) :

అదాయ పన్ను (ఐటీ) శాఖ సోదాలు చేయాలంటే ఆషామాషీ కాదు. లక్షిత వ్యక్తులు, వారి సన్నిహితులు, బంధువులు, ఉద్యోగులు, ఇలా అందరి ఇళ్లలో ఏకకాలంలో దాడులు జరుపుతుంటారు. ఇంతమంది ఇళ్లలో ఒకేసారి, ఒకే సమయంలో సోదాలు ఎలా సాధ్యం..? ఇంటి తలుపులు తట్టి.. వుయ్ ఆర్ ఫ్రమ్ ఐటీ డిపార్ట్‌మెంట్ అంటూ చకచకా ఇంట్లోకి వెళ్లి అందరి దగ్గర సెల్‌ఫోన్లు తీసుకోవడంతో పాటు ల్యాండ్ లైన్ ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేస్తారు. ఇల్లు, కార్యాలయాల్లో ఇలా సోదాలు జరుగుతుండగానే గేటు దగ్గర భద్రతా సిబ్బంది లోపలివారు బయటకు వెళ్లకుండా, బయటి వారు లోపలికి రాకుండా పహారా కాస్తారు. ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో అంతా ఒకేలా జరిగిపోతుంటుంది. ఇదెలా సాధ్యం..?



ఒక వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉద్యోగుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు డాట్ టు డాట్ కనెక్షన్ విధానాన్ని ఐటీ అధికారులు అనుసరిస్తారు. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి ఉన్న లింకులనే డాట్ టు డాట్ కనెక్షన్ అంటారు. ఒకసారి ఒక విభాగానికి చెందిన వ్యక్తి, వ్యవస్థపై సోదాలు చేస్తే వెంటనే అదే విభాగానికి చెందిన ఇతరులపై ఐటీ సోదాలు చేయదు. కొంత సమయం తీసుకుంటుంది. మరో విభాగానికి చెందిన వ్యక్తి, సంస్థపై దృష్టి సారిస్తుంది. అయితే స్థానిక పోలీసులు, సీఐడీ, ఇతర నిఘా విభాగాల్లో ఎక్కడైనా చిన్నపాటి నిబంధనల అతిక్రమణ జరిగే అవకాశం ఉండొచ్చు. కానీ ఐటీలో కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. ఐటీ అధికారులు కేవలం సోదాలు నిర్వహించడం, లెక్కలు సరిచూడడం, లెక్కల్లో లేని నగదు, నగలను స్వాధీనం చేసుకోవడం వరకే పరిమితం అవుతారు. నేరుగా కేసులు నమోదు చేయడం సాధ్యం కాదు. లెక్కల్లో లేని నగదుకు సంబంధించి పన్ను, జరిమానా విధించి వసూలు చేస్తారు. ఐటీ సోదాలు పైకి కనిపించేంత సులువుగా ఉండవు. ఒక్కోదానికి సంబంధించి వెనకాల కొన్ని నెలల పాటు పనిచేయాల్సి ఉంటుంది. సోదాలకు సంబంధించిన సమాచారం పరిమిత అధికారులకు మాత్రమే తెలుస్తుంది.

సమాచారం ప్రధానం..



పన్ను ఎగవేతదారులు, పెద్దమొత్తంలో లెక్కల్లో లేని నగదు కలిగి ఉన్నవారి సమాచారం ఐటీ శాఖకు రెండు రకాలుగా అందుతుంది. ఒకటి ఎవరైనా ఫిర్యాదు చేయడం, రెండోది ఐటీ విభాగం తన ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ద్వారా నిఘా పెట్టడం. ఐటీ శాఖ ఇన్‌ఫార్మర్ వ్యవస్థ అంత గోప్యంగా ఉంటుంది. వారు ఎవరి సమాచారం సేకరిస్తున్నారనేది ఎవ్వరికీ తెలియదు. ఆరోపణలు వచ్చిన వ్యక్తి, అతని సన్నిహితులకు సంబంధించి భౌతిక ఆధారాలతో పాటు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం అవసరమైన వివరాలు సేకరిస్తారు. ప్రధాన టార్గెట్, అతని సన్నిహితులు, ఎవరెవరి వద్ద నగదు లేదా ఆధారాలు ఉండే అవకాశం ఉంటుందో వారి ఇళ్లు, కార్యాలయాలు, గెస్ట్ హౌస్‌లు, ఫామ్‌హౌస్‌ల వివరాలు తెలుసుకోవడం, ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడికి వచ్చి వెళుతుంటారు..? ఇలా ప్రతీ అంశానికి సంబంధించి పక్కాగా సమాచారం సేకరిస్తారు. ఇందుకోసం ఐటీ బృందాలు సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి స్థాయిని బట్టి కొన్ని రోజులు, నెలలు అత్యంత గోప్యంగా సమాచారం సేకరిస్తారు. ఉదాహరణకు ఐటీ సోదాలు నిర్వహించాల్సిన వ్యక్తి సమాచారాన్ని సేకరించిన తర్వాత అధికారులు దాన్ని ఢిల్లీ ప్రధాన కార్యాలయానికి అందచేస్తారు. ఐటీ విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ అనుమతి మేరకు వారెంట్ తీసుకుంటారు.

స్ట్రైక్ టైం కీలకం

వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాల్సిన సందర్భాల్లో స్ట్రైక్ టైం నిర్ధారిస్తారు. ఉదాహరణకు శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతల నివాసంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సిబ్బంది, ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలకు తెల్లవారుజామున 5.30 గంటలు స్ట్రైక్ టైంగా నిర్ధారిస్తే సరిగ్గా అదే సమయానికి అన్నిచోట్ల సోదాలు ప్రారంభం కావాల్సిందే. అంత కచ్చితంగా జరగాలంటే స్ట్రైక్ టైం కంటే కొంత సమయం ముందే ఐటీ బృందాలు సమీప ప్రాంతానికి చేరుకుని ఉంటాయి. ఇలా చేయకపోతే ఒక సమయంలో ఒకచోట సోదాలు జరుగుతుంటే విషయం తెలుసుకుని మరో చోట ఉన్నవారు పరారవడం, ఆధారాలు మాయం చేసే అవకాశం ఉండడంతో ఐటీ సోదాల్లో స్ట్రైక్ టైం అత్యంత కీలకం.



కేంద్ర బలగాలు

ఐటీ సోదాల సమయంలో భద్రత మరో కీలక అంశం. సోదాలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత భద్రతా సిబ్బంది సహకారం తీసుకుంటారు. గతంలో ఐటీ సోదాలు నిర్వహించే ప్రాంతానికి సంబంధించి స్థానిక పోలీసుల సహకారం తీసుకునేవారు. ముందుగానే వారికి విషయం చెప్పాల్సి రావడం వల్ల కొన్ని సందర్భాల్లో అవతలి వ్యక్తికి సమాచారం వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఐటీ సోదాల సమయంలో స్థానిక పోలీసులు కాకుండా కేంద్ర బలగాలను వెంట తీసుకువెళుతున్నారు. దాడులకు కొన్ని గంటల ముందు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఐటీ కార్యాలయానికి చేరుకుంటాయి.

ఎలా సాధ్యం

ఇటీవల పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, ఇళ్లు, కార్యాలయాలు, ఆయా సంస్థల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగుల ఇళ్లు ఇలా ఒకే సమయంలో పదుల సంఖ్యలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐటీ బృందాలు ఏకకాలంలో సోదాలు జరిపాయి. ఎవరిపై అయినా ఇలాగే దాడులు జరుగుతాయి. తెల్లవారకముందే ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ ఎలా నొక్కుతున్నారు..? వారికి అన్ని అడ్రస్‌లు ఎలా తెలుసు..? ఐటీ దాడులు ఎదుర్కొంటున్నవారే కాదు, సాధారణ ప్రజలు, ప్రముఖుల్లోనూ ఇప్పుడు ఇదే ప్రశ్న. పక్కా సమాచారంతోనే ఐటీ అధికారులు సోదాలు చేపడతారు. 'మా సంస్థల్లో పనిచేస్తున్న కొంతమంది క్లర్కుల ఇళ్లలోనూ ఐటీ బృందాలు సోదాలు జరిపాయి. కొన్ని సంవత్సరాలుగా వారు మా వద్ద పనిచేస్తున్నా వారి చిరునామా మాకు తెలియదు. మరి ఐటీ అధికారులకు ఎవరు చెప్పారో..? అని బాధితులు చర్చించుకుంటున్నారు.

సీల్డ్ కవర్‌లో..

సోదాలకు అనుమతులు ఇచ్చిన తర్వాత స్థానికంగా ఉండే ఐటీ అధికారులు ఎన్ని ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి ఉంటుందనే సమాచారం మేరకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకుంటారు. ఒకటి, రెండు ప్రాంతాల్లో సోదాలకు 20, 30 మంది సిబ్బంది సరిపోతారనుకుంటే స్థానికంగా ఉండేవారిని వినియోగించుకుంటారు. వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు జరపాల్సి రావడం, వందల సంఖ్యలో సిబ్బంది అవసరం ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తారు. ఒకరోజు ముందుగానే స్థానిక హెడ్ క్వార్టర్లలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు హోటళ్లలో బస చేస్తారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే ఉంటారు. సోదాలు జరిగే రోజు అవసరాన్ని బట్టి అర్ధరాత్రి తర్వాత, తెల్లవారుజామున ప్రధాన కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్కో బృందాన్ని నడిపే బాధ్యతలు ఒక అధికారికి అప్పగిస్తారు. వారికి సీల్డ్ కవర్‌లో టార్గెట్‌కు సంబంధించిన వివరాలు అందజేస్తారు. సోదాలు జరిపే వ్యక్తి నివాసం, కార్యాలయం సమీపంలోని ల్యాండ్ మార్క్ చెప్పి పంపుతారు. అక్కడికి వెళ్లిన తరువాత సీల్డ్ కవర్ తెరిచి చూస్తే టార్గెట్ ఎవరు, అడ్రస్ ఎక్కడ అనేది తెలుస్తుంది.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తాం

- 'నన్నయ' వీసీ ఆచార్య శ్రీనివాసరావు
- అంతర్ కళాశాలల బెస్ట్‌ఫిజిక్, రెజ్లింగ్ పోటీలు, నన్నయ విశ్వవిద్యాలయం జట్టు ఎంపికల ప్రారంభం



బెస్ట్‌ఫిజిక్ క్రీడాకారులతో నన్నయ విశ్వవిద్యాలయ అధికారులు

దివాన్‌చెరువు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో విశ్వవిద్యాలయంలో మరిన్ని క్రీడావసతులు సమకూర్చి ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్శిటీలో అంతర్ కళాశాలల బెస్ట్ ఫిజిక్, పురుష విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు, రెజ్లింగ్ పురుషుల, స్త్రీల జట్టు ఎంపికలను శనివారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి రెజ్లింగ్‌కు 45 మంది, బెస్ట్ ఫిజిక్‌కు 32 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆదికవి నన్నయ విశ్వవిదాయలయం బెస్ట్ ఫిజిక్ పోటీలు 60,65,70,75,80,85 కిలోల కేటగిరిల్లో నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి మూడు స్థానాల విజేతలకు పతకాలను అందించి అభినందించారు.

ఎంపికైన వారి వివరాలు...

60 కిలోల కేటగిరిలో వై.భరత్ (ఆదిత్య కళాశాల, సూరంపాలెం), షేక్ వల్లీ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఆర్‌కే విశ్వనాథమ్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 65 కిలోల కేటగిరిలో ఎం.సాయి లోకేశ్(సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు), ఎస్. దినేష్‌కుమార్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ) ఎన్.నాగసందీప్ (శ్రీకాకతీయ కళాశాల, భీమడోలు), 70 కిలోల కేటగిరిలో ఎస్‌కే మన్సూర్(విష్ణు కళాశాల, భీమవరం), ఎ.జగదీష్ (ఏబీఎన్ఎన్ కళాశాల, పాలకొల్లు), పి.భానుచంద్ర (ఆదిత్య కళాశాల, కాకినాడ) 75 కిలోల కేటగిరిలో ఎల్.వి.సూర్యప్రకాశ్ (పీఆర్ కళాశాల, కాకినాడ), ఎం.జగదీష్ మణికంఠ(డాక్టర్ బీవీ రాజు, భీమవరం), జె.దైవప్రసాద్(పీఆర్ కళాశాల, కాకినాడ), 80 కిలోల కేటగిరిలో టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), యు.దిలీప్‌కుమార్ (ఏబీఎన్ కళాశాల, కొవ్వూరు)ఎన్.సుకుమార్ (పీఆర్ కళాశాల, కాకినాడ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 85 కిలోల కేటగిరిలో వై.మోహనసాయిఅభిషేక్ (పీఆర్ కళాశాల, కాకినాడ) కె.జయకర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు) ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకున్నారు. టీమ్ చాంపియన్ షిప్ కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాలకు దక్కింది. మిస్టర్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 ట్రోఫీని టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ) కైవసం చేసుకున్నారు. బెస్ట్ ఫిజిక్ పురుషుల టీమ్ ఎంపికలో భాగంగా ఉత్తమ ప్రతిభకనబరిచిన టి.ప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), ఎల్.వి.సూర్యప్రకావ్ (పి.ఆర్ ప్రభుత్వకళాశాల,కాకినాడ) ఎస్.కె.మన్సూర్ (విష్ణుకళాశాల, భీమవరం) వై.భరత్ (ఆదిత్యకళాశాల, సూరంపాలెం)లను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. పంజాబ్‌లోని గురుదాస్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత పోటీలకు వీరిని పంపనున్నారు.

రెజ్లింగ్ మహిళా పోటీల్లో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది క్రీడాకారులను జట్టుగా ఎంపిక చేశారు. అలాగే రెజ్లింగ్ పురుషుల పోటీల్లో ఫ్రీస్టైల్ విధానంలో 57 నుంచి 97 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొన్నారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 నుంచి 67 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు హాజరై కుస్తీలో ప్రతిభ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని పంజాబ్‌లోని గురుదాస్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత పోటీలకు నన్నయ యూనివర్శిటీ జట్టుగా పంపనున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకచైర్మన్లు కె.సుబ్బారావు, డి.జ్యోతిర్మయి, కార్యదర్శి ఎంవీవీఎస్ మూర్తి, పరిశీలకుడు రమణ ఎంపిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రెజ్లింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు


కొబ్బరి ధరల పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

స్వల్పంగా మద్దతు ధరలు పెంచుతూ కేబినెట్ నిర్ణయం

మిల్లింగ్‌కోప్రాకు రూ.422, బాల్‌కోప్రాకు రూ.100 మద్దతు ధరపెంపు

అంబాజీపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొబ్బరి మద్దతు ధరలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని కొబ్బరి పండించే రాష్ట్రాల్లో రైతులను ఆదుకునే విధంగా నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేసే ధరలను స్వల్పంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలో పండించే పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు ప్రతి ఏటా డిసెంబరు నెలలో ఆయా రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తుంది. ఈ సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెడుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదించిన అనంతరం పంటలపై మద్దతు ధరలను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తుంది. దీనిలో భాగంగా కొబ్బరికి స్వల్పంగా మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ ఆమోదించింది. 2024 సంవత్సరంలో మిల్లింగ్ కోప్రా రూ.11160 ఉండగా 2025 సంవత్సరానికి రూ.422 పెంచి రూ.11,582గా నిర్ణయించింది. అలాగే 2024లో బాల్‌కోప్రా 12,000 ఉండగా రూ.100 పెంచి రూ.12,100గా నిర్ణయించారు. 2025లో ఆయా రాష్ట్రాల్లో నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొబ్బరి ధరలు రూ.12వేలు పైబడి ఉండటంతో ఇప్పుడు నాఫెడ్ కేంద్రాలు తెరిచిన పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా రైతులు కేంద్రం పెంచిన ధరలపై పెదవిరుస్తున్నారు. కొబ్బరి కనీస మద్దతు ధర రూ.15వేలు పైబడి ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. నష్టాల్లో ఉన్న కొబ్బరిరైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ధరల ను పెంచాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు కోరుతున్నారు.


మార్కెట్‌లో కురిడి కొబ్బరి

రాష్ట్రంలో తగ్గుతున్న గంజాయి కేసులు

- రాజమహేంద్రవరంలో అదుపులోకి వచ్చిన బ్లేడ్ బ్యాచ్‌లు
- కోనసీమ జిల్లాలో గంజాయి సమస్య పెద్దగా లేదు
- రాష్ట్రంలో ఆరువేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్


పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

పి.గన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సమస్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెద్దగా లేదని, రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఆరు నెలల్లో గంజాయి కేసులు సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. నేరాలను అదుపులో ఉంచేందుకు ఏలూరు రేంజ్ పరిధిలోని 6 జిల్లాల్లో పోలీసు అధికారులను సమన్వయం చేయ్యడం జరిగిందన్నారు. గంజాయితో పాటు దొంగతనాలను అరికట్టేందుకు పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని దానిలో భాగంగానే వారు ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా స్టేషన్‌ల పరిధిలో పోలీసులు వారి కదలి కలపై నిఘా ఉంచా రని పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కోనసీమ జిల్లా పి.గన్నవరం పో లీస్‌స్టేషన్‌లో త నిఖీలు నిర్వహించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గంజాయిని అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఆర్గనైజేషన్‌లో భాగంగా ఐజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో పోలీసు అధికా రులు, సిబ్బందికి సమీక్షలు నిర్వ హించడంతో పాటు సాంకేతికపరమైన శిక్షణను ఇవ్వడం జరుగు తుందన్నారు. గంజాయి పట్టుబడిన సమయంలో నేరస్తుల పట్ల ఏవిధంగా వ్యహరించాలో సూచి స్తున్నట్టు ఆయన తెలిపారు. గంజాయి కేసుల విషయంలో కాలయాపన చెయ్యకుండా దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి ముద్దాయిలకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. అనవసరమైన కేసులు నమోదు చెయ్య కుండా నిజమైన గంజాయి స్మగ్లర్లను గుర్తించి వారిపైనే కేసులు నమోదు చేసేవిధంగా చర్యలు తీసుకుం టున్నామన్నారు. బ్లేడ్ బ్యాచ్‌లపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, అదేపనిగా నేరాలకు పాల్పడు తున్న వారిపై కొత్త సెక్షన్‌లు వేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరంలో పోలీసులు నిర్వహిస్తున్న చర్యలతో గత 6నెలలుగా బ్లేడ్ బ్యాచ్‌లు అదుపులోకి వచ్చాయన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు. బ్యాంకర్స్‌తో సమావేశాలు ఏర్పాటు చేసి కరెంట్ అక్కౌంట్‌లపై నిఘాపెట్టామని చెప్పారు.

డబ్బులు పోగొట్టుకుంటే..

అలాగే బాధితులు డబ్బులు పోగొట్టుకున్న 3 గంటల్లోపు 1930 నెంబర్‌కు కాల్‌చేస్తే ఆ డబ్బు మరో వ్యక్తి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ కాకుండా చూస్తారన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి 13 ఉమ్మడి జిల్లాలు వేదికగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6వేల మంది కానిస్టేబుళ్లకు రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, మరో 18 నెలల్లో ఆ సిబ్బంది అందుబాటులోకి వస్తారన్నారు. కొత్త సిబ్బంది వచ్చిన వెంటనే ముఖ్యంగా సిబ్బంది కొరతతో ఉన్న కోనసీమకు ఎక్కువ మందిని కేటాయిస్తారని ఆయన తెలిపారు. కోనసీమలో ప్రస్తుతం పండుగలు కాలం కావడంతో ఆయా గ్రామాల పెద్దలు, యువతతో ముందుగానే సమావేశాలు ఏర్పాటు చేసి జాతర్ల సమయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తొలుత ఐజీకి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ బి.శివకృష్ణ, సిబ్బంది స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అందించారు.


పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఐజీకి స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు

చేంజ్ మేకర్‌గా రాజమహేంద్రవరం

శానిటేషన్‌లో ఆర్ఎంసీకి అవార్డులు


అవార్డులతో కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్‌హెచ్‌వో, ఎస్ఎస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన చేంజ్ మేకర్స్ కాంక్లేవ్‌లో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు అవార్డులు లభించాయి. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న శనివారం కమిషనర్‌ను కలిసి అవార్డులను అందించారు. ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 24 రాష్ట్రాల నుంచి 100 పట్టణ స్థానిక సంస్థలు హాజరయ్యాయని తెలిపారు. శానిటేషన్ పరంగా నగరాన్ని మార్పు చేసే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టినందుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థను చేంజ్ మేకర్‌గా గుర్తించడం అభినందనీయమని కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్‌లను అభినందించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు

ముగిసిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో చదువుతున్న విద్యార్థులంతా వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని చాన్సలర్ కేవీవీ.సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీజీయూలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో 2రోజులుగా నిర్వహించిన వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా చాన్సలర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వ్యవసాయం, ఉద్యానవన వంటి అనుబంధ రంగాలు ఇమిడి ఉన్నాయన్నారు. వీసీ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితాలను ప్రభావితం చేసే ఆలోచనలు వినూత్న ఆవిష్కరణలతో చేయవచ్చన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త పీసీ వెంగయ్య మాట్లాడుతూ ప్రకృతికి దగ్గరగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. మంచి ఆహారం తీసుకుంటే ఆసుపత్రికి వెళ్లే అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో కేకే హెర్బల్ ఇండస్ట్రీస్ మేనేజర్ కేఆర్ కథం, బెంగుళూరులోని నెకెసిస్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చంద్రశేఖర్ హీరా మత్, జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సి పాల్స్ ఎండీ ధనరాజు, కె.వల్లీమాధవి, టి.జయానందకుమార్, ఎన్.లీలావతి, బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

డి.నరసింహ కిషోర్


కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

కోరుకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, ఉత్పత్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన కోరుకొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి అనేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతం కంటే ప్రస్తుతం క్రైం రేటు తగ్గిందన్నారు. సైబర్ మోసాలు, దొంగతనాలు, గంజాయి, క్రయ విక్రయాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. బస్టాండ్ సెంటర్, మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత పంచాయతీదేదన్నారు. వారికి వ్యాపారులు సహకరించకపోతే పోలీసులు కేసులు కడతారన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిబ్బందిని ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొబ్బరి మొక్కను నాటారు.

వేటగాళ్లకు చిక్కిన దుప్పి!

ముంజవరప్పాడు గ్రామంలో అధికారుల తనిఖీలు

ఓ ఇంటిలో వేటమాంసం..

గ్రామ శివారులో దుప్పిని చంపిన ఆనవాళ్లు


దుప్పి చర్మాన్ని కాల్చిన ప్రాంతాన్ని చూస్తున్న అధికారులు

రాజవొమ్మంగి డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో కొందరు దుప్పిని చంపి మాసాన్ని ఇంటిలో భద్రపరచుకున్న విషయాన్ని శనివారం అధికారులు వెలుగులోకి తెచ్చారు. కింద్ర పంచాయతీ ముంజవరప్పాడు గ్రామంలో కొందరూ దుప్పిని చంపారనే సమాచారంతో రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి, అటవీశాఖ ఎఫ్ఎస్‌వో రాము, ఎఫ్‌బివో ఆనంద్‌లు గ్రామంలో పర్యటించగా ఓ ఇంటిలో వేట మాంసాన్ని అధికారులు గుర్తించారు. గ్రామస్థుల సమాచారంతో గ్రామ శివారు జీడితోటలో దుప్పిని చంపిన ఆనవాళ్లను కాల్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. సగం కాలి ఉన్న దుప్పి చర్మాన్ని ఆ ప్రాంతంలో గుర్తించారు. కొందరు అనుమానితులను అటవీశాఖాధికారులు శనివారం రాత్రి రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చి దర్యాప్తు చేశారు.


సగం కాలి ఉన్న దుప్పి చర్మం

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


నిందితులతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

40 కిలోలు స్వాధీనం

మోతుగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి కారులో 40 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని డొంకరాయి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన ప్రకాష్ జ్యోతిపాస్, రాజమహేంద్రవరానికి చెందిన చల్ల రవీంద్ర కలిసి గంజాయిని హుండాయ్ ఐ10 కారులో తరలిస్తున్నారు. డొంకరాయి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా డొంకరాయి ఎస్ఐ శివకుమార్, తన సిబ్బందితో పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రామవరం ఎంపీడీవో రవికిషోర్ సమక్షంలో అరెస్టు చేశారు. చింతూరు ఇన్‌చార్జ్ సీఐ, ఎటపాక సీఐ కేసు దర్యాప్తు చేసి రిమాండ్‌కు తరలించారు.

సివిల్ సర్జన్లుగా పదోన్నతి

కాకినాడ జీజీహెచ్

సీఎస్ఆర్ఎంవోగా రాజకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబులకు సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఇప్పటి వరకూ డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ రాజకుమారికి కాకినాడ జీజీహెచ్‌లో సీఎస్ఆర్ఎంవోగా, డాక్టర్ శ్రీహరిబాబుకు శ్రీకాకుళం జిల్లా పలాస కిడ్నీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ డయాలసిస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అక్రమంగా తరలిస్తున్న 84 ఆవుల పట్టివేత

రౌతులపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 84 ఆవులను కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం శివారున బీజేపీ జిల్లా యువ అధ్యక్షుడు చిత్ర పాపారావు అడ్డుకున్నారు. రౌతులపూడి పోలీస్‌స్టేషన్ అప్పజెప్పగా ఎస్ఐ వెంకటేశ్వరరావు వాహనాలతో పాటు తరలి స్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆవులను విశాఖ జిల్లా ఏజెన్సీ చింతపల్లి నుంచి హైదారాబాద్‌కు తరలిస్తుండగా ఎస్.అగ్రహారం వద్ద పాపారావు అడ్డుకునిపోలీస్‌లకు అప్పగించారు.


వ్యాన్‌లో తరలిస్తున్న ఆవులు

వైద్య వృత్తి పవిత్రమైనది

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్

కరప, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని, తమ వద్దకు వచ్చే పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులోని కాకినాడ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో శనివారం ఫిజియోథెరపీ స్నాతకోత్సవ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బి.శివశిరీష, డైరెక్టర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కోరుకొండ బాబ్జి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పేషెంట్ల పట్ల సహనంతో వ్యవహరించాలని, వారు చెప్పే ఆరోగ్య సమస్యలను ఆసాంతం ఓపిగ్గా విని వైద్యమందిస్తే మంచి డాక్టర్‌గా సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ శివశిరీష ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతను వివరించారు. ఫిజియోథెరపీకి మంచి భవిష్యత్ ఉందని, పుస్తక పఠనం కంటే పేషెంట్‌లకు ట్రీట్మెంట్ చేయడం ద్వారా నేర్చుకున్నది బాగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్య పట్టాలు అందించి ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్, కీళ్ల వ్యాధి నివారణ యూనిట్లను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కారక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ప్రొఫెషర్లు, అధ్యాపకులు, రామకృష్ణ, పేరెంట్స్, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జి

కనకాల తాతయ్యకు ఘన నివాళి

యానాం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం యానాం మాజీ మేయర్, ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమరయోధుడు కనకాల తాతయ్య జయంతి నిర్వహించారు. ఫెర్రీరోడ్డులోని అయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే నిత్య సుదర్శన హోమానికి శనివారం చెన్నైకు చెందిన నముదూరి వెంకటసత్యసోమయాజులు-సురేషా, కుటుంబ సభ్యులు రూ.లక్ష అందజేశారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారధి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

16 గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పదహారు గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అన్నారు. శనివారం సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దేవ ముఖ్యఅతిథిగా మాట్లాడారు.16గ్రామాల ప్రజల ప్రజాప్రతినిధులు సమస్యలపై అధ్యయనంచేసి వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు.ప్రతీగ్రామం మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు ఎన్నుకున్న నాయకులే కాకుండా అధికారులు కూడా సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడంలో ముందుండాలన్నారు. రహదారులను అభివృద్ధి చేయాలని, ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ప్రతీ ఇంటికీ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ ఆయకట్టు 4500ఎకరాలుంటే కేవలం ఖరీఫ్ సీజన్ 189, రబీ సీజన్‌లో 2200ఎకరాల సాగుచేయడంపై వ్యవసాయాధికారులు దృష్టి సారించాలన్నారు. లోఓల్టేజ్, మంచినీటి సమస్యలు తలెత్తకుండా గుడిమూలలో రూ.4కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మించినట్టు తెలిపారు. మండల పరిషత్ నిధులతో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రూ.20.75లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు డీసీ ఉపాధ్యక్షుడు ఆకన బాబ్జినాయుడు, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఎవ్‌పీసీ కె.సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రెవెన్యూ, విద్యుత్, పోలీసు, వైద్య, విద్య, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్.యానాం బీచ్‌లో శాశ్వత విద్యుద్దీకరణ

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



ఎస్.యానాం సముద్ర తీరంలో బీచ్ వాలీబాల్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌లో శాశ్వత విద్యుద్దీకరణకు చర్యలు తీసుకున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. దీనికోసం బీచ్‌లో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల27 నుంచి 29వరకు జరగనున్న జాతీయ మహిళా బీచ్ వాలీబాల్ పోటీల నిమిత్తం బీచ్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాలీబాల్ పోటీల నిర్వహణకు జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం కల్పనపై ఆయన ట్రాన్స్‌కో ఏఈ శ్రీహరికి పలు సూచనలు చేశారు. క్రీడా ప్రాంగణం సంసిద్ధతపై పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు ఈనెల 23న ప్రారంభిస్తామని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. వాలీబాల్ పోటీల ఏర్పాట్లపై వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభంతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో రాజ్‌కుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి వి.రాధాకృష్ణ, వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, సంయుక్త కార్యదర్శి అయితాబత్తుల అజయ్‌సింగ్, అముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, సత్తి చిన్నా, ఆకేటి పెద్ద, రవణం మధు, అయితాబత్తుల రాజశేఖర్, అడపా అవినాష్, దెందుకూరి సత్తిబాబురాజు, దాట్ల గోపీరాజు, యాళ్ల సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి పల్లి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కర్మేంద్రియాలను అదుపు చేసుకోవడమే ధ్యానం



అమలాపురం ఓంశాంతి కేంద్రంలో ప్రపంచ ధ్యాన దినోత్సవ సదస్సులో మాట్లాడుతున్న బీకే శ్రీదేవి

అమలాపురం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎందరో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని అమలాపురం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి చెప్పారు. కర్మేంద్రియాలను అదుపు చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానమే ముఖ్య సాధనమని వివరించారు. ఐక్యరాజ్యసమితి ఈఏడాది నుంచి ప్రతీ ఏటా డిసెంబరు 21న ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రకటించిన నేపథ్యంలో శనివారం అమలాపురం ఓంశాంతి కేంద్రంలో మెడిటేషన్ డే సదస్సు నిర్వహించారు.మానసిక ప్రశాంతతను పొందేందుకు ధ్యానం ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. తొలుత జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, బోనం సత్తిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. మెడిటేషన్ ట్రైనర్ బీకే స్వరూప మాట్లాడుతూ కర్మేంద్రియాలను ఏవిధంగా అదుపులో ఉంచుకోవాలో అందుకు నిరంతరం చేయాల్సిన సాధన గురించి వివరించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో శనివారం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కట్ చేశారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్లు రుద్రరాజు నానిరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి బాబు, బొంతు గోవిందుశెట్టి, దంగేటి రుద్ర, కుడుపూడి భరత్‌భూషణ్, షేక్ అబ్దుల్‌ఖాదర్, పొగాకు శ్రీను, జాన గణేష్, కామిశెట్టి శ్రీనివాస్, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల రమేష్ ఆధ్వర్యంలో బుద్దాల బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని విశ్వరూప్ ప్రారంభించారు. ఐటీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, ఉంగరాల సంతోష్, దూడల ఫణి పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసిన ఐజీ



అమలాపురం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ శనివారం అమలాపురం డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ డెల్టాను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతా

డెల్టా ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్



రాజోలు: శివకోటిలో ఎమ్మెల్యే వరప్రసాద్‌కు మిఠాయి తినిపిస్తున్న గుబ్బల శ్రీనివాస్, గుబ్బల సత్యనారాయణ

మలికిపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్‌గా ఎన్నికైన టీడీపీ రాజోలు మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్‌ను ఎన్డీఏ శ్రేణులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సెంట్రల్ డెల్టాను సస్యశ్యామలంగా తీర్చిదిద్దడానికి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ముందుకు వెళ్తానన్నారు. **శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడానికి మురుగు కాల్వలు బాగు చేయడానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు.** అభినందన కార్యక్రమంలో ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, మొల్లేటి శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మ అమ్మవారి సేవలో శ్రీనివాస్

రాజోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన గుబ్బల శ్రీనివాస్ శనివారం శివకోటిలోని పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్ తండ్రి సత్యనారాయణ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మిఠాయి తినిపించారు. అలాగే శ్రీనివాస్‌కు తండ్రి సత్యనారాయణ మిఠాయి తినిపించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, మండల జనసేన అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, కడలి కపిల్, మట్టపర్రు సర్పంచ్ కడలి దుర్గ, రాజోలు నీటిసంఘం ఉపాధ్యక్షుడు రామేశ్వరపు ప్రభాకరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు.

మధ్య డెల్టా చైర్మన్‌కు అభినందన

మామిడికుదురు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మధ్య డెల్టా చైర్మన్‌గా ఎంపికైన గుబ్బల శ్రీనివాస్‌కు మామిడికుదురులో టీడీపీ, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. మామిడికుదురు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా శ్రీనివాస్‌కు పూలమాలలువేసి సత్కరించారు. పొలాలకు పూర్తి స్థాయిలో నీరందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండలశాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, సాధనాల సుబ్బారావు, చిట్టూరి వేణు, భైరిశెట్టి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

పలు చోట్ల నిరసన



అమలాపురంలో అమిత్‌షా రాజీనామా చేయాలని నిరసన తెలుపుతున్న ఆటో వర్కర్ల యూనియన్

అమలాపురం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దళిత ప్రజాసంఘాలు, ఆటో యూనియన్ కార్మికులు నిరసన తెలిపారు. స్థానిక ఎర్రవంతెన వద్ద శనివారం ది కోనసీమ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రదర్శన జరిపారు. నిరసనలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, గెద్దాడ బుద్ధరాజ్, మెండి డేవిడ్ అంబేడ్కర్, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

రాజోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును ఉచ్చరించకూడదని మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. తాటిపాక సెంటర్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ దేవ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శనివారం నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ భారతదేశ పార్లమెంటు వ్యవస్థతో పాటు యావత్ భారతదేశ పరిపాలన వ్యవస్థకు అంబేడ్కర్ మాత్రమే భగవంతుడన్నారు. కార్యక్రమంలో నల్లి శ్రీనివాస్, బత్తుల మురళీకృష్ణ, భూపతి వెంకటపతి, బొంతు మణిరాజు, జిల్లెల్ల వినోద్, లిఖితపూడి బుజ్జి, చిలకపాటి శ్రీధర్, మెడబల రాజకుమార్, కాకర విశ్వనాథం, బత్తుల జనార్థనరావు పాల్గొన్నారు.

మలికిపురంలో నిరసన

మలికిపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా కేంద్రహోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల మలికిపురం సెంటర్‌లో బహుజన సమాజ్‌పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లౌకికవాదం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బత్తుల లక్ష్మణరావు, ముత్యాల శ్రీనివాసరావు, పి.మోహన్‌బాబు, రేచర్‌జ్యోతి, నల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు



ముమ్మిడివరంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 22మండలాలకు చెందిన విద్యార్థులకు శనివారం ముమ్మిడివరంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 20మండలాల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో ముమ్మిడివరంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు-డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి బి.హనుమంతరావు, మండల విద్యాశాఖాధికారులు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావు, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వ్యాసరచనలో 36మంది విద్యార్థులు పాల్గొనగా మొదటిస్థానం ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.తనూష్‌తేజ, రెండోస్థానం కె.గంగవరం మండలం దంగేరుకు చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని డి.శ్రీవిద్య, అయినవిల్లి మండలం కొండుకుదురు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరతి విద్యార్థిని ఏడిద నవ్యలక్ష్మి తృతీయస్థానం సాధించారు. అలాగే వక్తృత్వ పోటీల్లో 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానం అయినవిల్లి మండలం కొండుకుదురు జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి ఆర్ఎన్ఎస్‌బీ పవన్‌కుమార్, రెండోస్థానం అంబాజీపేట మండలం అంబాజీపేట జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని ఎస్.మనస్వినిలక్ష్మి, మూడో స్థానం అయినవిల్లి మండలం సిరిపల్లి జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థిని ఎం.సాయిఆశ్రిత సాధించారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీంబాషా అభినందించారు. జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో విజయవాడలో ఈనెల23న పోటీలు నిర్వహిస్తారన్నారు. వేదిక ఎక్కడన్నది తరువాత తెలియజేస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు గైడ్ టీచర్ సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సెల్:6301365479)కి వివరాలు అందించాలని డీఈవో సూచించారు.

106మంది విద్యార్థులకు ఉద్యోగాలు

అమలాపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రముఖ కంపెనీల ప్రతినిధులు మినీ జాబ్ మేళా నిర్వహించారు. కళాశాలకు చెందిన 106మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు అభినందించారు. రెండు రోజుల పాటు మినీ జాబ్ మేళా నిర్వహించిన కంపెనీ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. టెక్ మహీంద్ర, హెచ్‌డీఎఫ్‌సీ, అపోలో ఫార్మసీ, జస్‌కో, టీసీఎస్ కంపెనీల ప్రతినిధులతో పాటు కళాశాల ఏవో కరాటం ప్రవీణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

అమలాపురంటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థినులు ముందుకు సాగాలని జాగ్వర్ ల్యాండ్ రోవర్ కంపెనీ సీఈవో ఇంద్రగంటి లలిత సూచించారు. విద్యార్థినులు ఉన్నత భవిష్యత్తు కోసం పట్టుదలతో కృషి చేయాల్సి ఉందన్నారు. అమలాపురం ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ఆమె విద్యార్థినులతో శనివారం ఇష్టాగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గుర్రం శ్రీనివాసరావు, అడబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన పునాదులతోనే మంచి ఫలితాలు

ముమ్మిడివరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను సమర్థవంతంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసేందుకు ఉద్దేశించిన జ్ఞానజ్యోతి ప్రోగామ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు త్వరలో ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ బొజ్జ రమణశ్రీ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల19న డీఆర్‌పీలకు ప్రారంభమైన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా రమణశ్రీ మాట్లాడుతూ జ్ఞాన ప్రకాష్, పూర్వ ప్రాథమిక పాఠశాలలో జ్ఞానజ్యోతి అమలుకానున్నట్లు తెలిపారు. జ్ఞానజ్యోతి ప్రోగామ్‌లో భాగంగా జనవరి మొదటి వారం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. డీఆర్‌పీలు పునఃశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అభ్యసనంపై శిక్షణను సమర్థవంతంగా ఇవ్వాలన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భాషా, గణితంలో బలమైన పునాదులు ఏర్పార్చడం కోసం మూడు రోజులు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని 124మందికి మూడు రోజులు ఆరుగురు కేఆర్‌పీలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డీఆర్‌పీలు చేసిన డీఎల్ఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమావేశంలో ఎంఈవో-2 రాయుడు ఉదయభాస్కరావు, కెఆర్‌పీలు జె.కళావతి, విజయశ్రీ, రమాదేవి, వి.వరహాలక్ష్మి, కేవీఆర్ తాతాజీ, పి.నిర్మలకుమారి, నోడల్ సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనశ్శాంతి కోసం వెతుక్కునే పనిలో మనిషి

అమలాపురంరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో మనిషి మనశ్శాంతి కోసం వెతుకుతూ గందరగోళ పరిస్థితుల్లో జీవిస్తున్నాడని అంతర్జాతీయ సువార్తకుడు బ్రదర్ ఎడ్వర్డ్ విలియమ్స్ చెప్పారు. మానవాళిని రక్షించేందుకు ఏసుక్రీస్తు లోక రక్షకునిగా భూమిపైకి వచ్చారన్నారు. ఈదరపల్లిలోని జనకల్యాణ్ కార్యాలయంలో శనివారం రెడీమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాస్టర్ విజయ్‌బాబు అధ్యక్షతన శనివారం కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ వేడుకల కేక్ కట్ చేశారు. ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విలియంను సత్కరించారు. జి.కవిత, మెండి కమల, సతీష్, భావన, సత్తిబాబు, కడలి సత్యనారాయణ, రమణి, లోకేష్, గుర్రాల అమల, శ్యామల, రామలక్ష్మి పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి

మలికిపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మలికిపురం దీప్తి మహిళా కళాశాలలో క్రిస్మస్ సందర్భంగా శనివారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

భూగర్భ జలాల కాలుష్యం నుంచి కాపాడండి

పి.గన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు కిడ్నీ, కేన్సర్ వ్యాధులతో బాధపడుతున్నారని శని వారం కాకినాడలో జరిగిన ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వెల్లడించారు. ఈసమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నరేంద్రపురానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని సిబ్బంది కొరత, నూతనభవనం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. అత్యవసర మైతే నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంద న్నారు. నూతన భవనంతో పాటు సిబ్బందిని నియమించాలని కోరారు. పూర్తిగా కంటిచూపు కోల్పోయిన వారికి పూర్తిస్థాయి పింఛన్ ఎందుకు మంజూరు చేయడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇటీవల రెండు కేసులను పంపితే తిరస్కరించారని, అర్హులకు పూర్తిస్థాయి పింఛన్ అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఎమ్మెల్యే కోరారు.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

అమలాపురం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు చెప్పారు. నడిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ చెల్లుబోయిన నాని ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13అర్జీలను స్వీకరించారు. కార్యదర్శి బందా అనంతలక్ష్మితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పాలగుమ్మిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పది అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. అనాతవరంలో సర్పంచ్ మిమ్మితి చిరంజీవి అధ్యక్షతన శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతుల నుంచి వచ్చిన వినతులను ఆమె స్వీకరించారు. ఉపసర్పంచ్ పేరిచర్ల సురేష్‌రాజు, నీటిసంఘం అధ్యక్షుడు శీలం వెంకటేశ్వరరావు, కురసాల శివబాబు, దంగేటి పండు, పెయ్యల పరశురాముడు, వాసంశెట్టి పట్టాభిరామయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సురేష్, వీఆర్వోలు కడలి బాలాజీ, రమణాతి భాస్కరరావు, దేవదాయశాఖ అధికారులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వినతుల స్వీకరణ

మామిడికుదురు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌జేవీ రామ్మోహనరావు, తహశీల్దార్ వైవీ ఆచార్యులు కోరారు. ఈదరాడలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం ప్రజల వద్దకే భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో 668 దరఖాస్తులు

రాజోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాటిపాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు డీఎల్పీవో పి.బొజ్జిరాజు హాజరయ్యారు. రెవెన్యూ శాఖలకు సంబంధించి 9 దరఖాస్తులు, రేషన్‌కార్డులకు 185, గృహనిర్మాణం 15, పింఛన్లు 233, ఇళ్లస్థలాలు 220, ఇతర శాఖలకు సంబంధించి 6, మొత్తం 668 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ఎస్ రాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో రెవెన్యూ సభలు

అల్లవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): డి.రావులపాలెం, దేవగుప్తం, గుండెపూడి గ్రామాల్లో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలలో 23 అర్జీలు వచ్చాయని తహశీల్దారు ఎన్‌వీఎల్ నరసింహారావు అన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, సర్పంచ్‌లు ఉండ్రు భగవాన్ దాస్, గుంటూరి కృష్ణంరాజు, ఆర్ఐ కె.మన్యం పాల్గొన్నారు.

గణితశాస్త్ర దినోత్సవం

కాట్రేనికోన, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో శనివారం గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ సిద్ధాంతాలు యువతకు ఆదర్శప్రాయమని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్ అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీఎస్‌ఎస్ వర్మ, శ్రీసందీప్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం



అమలాపురం బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అమలాపురం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న జమిలి ఎన్నికల విధానం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సీనియర్ న్యాయవాది, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. జమిలి ఎన్నికలు వద్దు దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని నినదించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశ సమగ్రతకు దామాషా పద్ధతి శరణ్యమన్నారు. అమలాపురం బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు జమిలి విధానాన్ని నిరసిస్తూ ప్రదర్శన జరిపారు. రాష్ట్ర ప్రభుత్వాల స్వేచ్ఛను హరించడమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పెయ్యల శ్రీనివాస్, కటికదల సత్యనారాయణ, డి.చిరంజీవి, పెయ్యల సత్యనారాయణ, దొరబాబు, బుడితి వెంకటరమణ, ఎన్.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణకు గణితమే మూలాధారం

అమలాపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యక్తుల ఆర్థిక నిర్వహణకు గణితమే మూలాధారమని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ చెప్పారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం శ్రీవెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో కోనసీమ సైన్స్ పరిషత్ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేశ్వరశర్మ మాట్లాడుతూ ఉద్యోగమైనా, వ్యాపారమైనా,ఇంటి నిర్వహణ అయినా గణితంతోనే ముడిపడి ఉంటుందన్నారు. ఉద్యోగావకాశాలకు గణితంలో ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరాటం ప్రవీణ్, ఈతకోట శ్రీలక్ష్మి, కేవీఆర్ఎన్ నరసింహారావు, యాలంగి వరప్రసాద్, సీహెచ్ శ్యామ్సన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్వేశ్వరశర్మను సత్కరించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీడీవో

ముమ్మిడివరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లంకాఫ్‌రాణేలంక, పళ్లవారిపాలెం, రాణేలంక సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలను ఆయన పరిశీలించారు. సచివాలయ పాత రిజిష్టర్లను పరిశీలించి సిబ్బంది సూచనలిచ్చారు.

ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మామిడికుదురు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలత సూచించారు. మామిడికుదురులోని బాలికల వసతిగృహంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సూపర్‌వైజర్ కుడుపూడి శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, శిరీష, ఏఎన్ఎం దుర్గాదేవి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

ఐ.పోలవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న 51మంది లబ్ధిదారులకు రూ.38లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, అర్దాని శ్రీనివాసరావు, రాయుడు గంగాధర్, టేకుమూడి లక్ష్మణరావు, మహదశ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నా ఊరూ.. నా ప్రజలే.. నా ధ్యాస: మల్లాడి

35ఏళ్లు ప్రజా సేవ వేడుక



మల్లాడిని ఘనంగా సత్కరిస్తున్న అభిమాన సంఘ ప్రతినిధులు

యానాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో మాదిరిగా ఓటును అమ్ముకోకుండా ప్రజలు నిజాయితీగా ఉంటే త్వరలో నా నిర్ణయం ప్రకటిస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక యర్రాగార్డెన్స్‌లో మల్లాడి ప్రజాసేవ ప్రస్థానానికి 35ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం రాత్రి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ 1889 డిసెంబరు 21న మొదలైన ప్రజాసేవ ప్రస్థానం నేటితో 35ఏళ్లు పూర్తయిందన్నారు. దీనికి అంతటికీ యానాం ప్రజలు, స్నేహితులు, నాయకులు, అభిమానులేనన్నారు. మల్లాడి పోటీ చేస్తే ప్రజల ఇంటింటికి ప్రచారానికి వెళ్లకుండా ఇంట్లో కూర్చోబెట్టి నెగ్గించే సత్తా మీఅందరికి ఉందన్నారు. గతంలో కొంతమంది ఎన్నడూ లేని విధంగా ఓటుకు నోటుకు అమ్ముడుపోయిన కారణంగా యానానికి ఈపరిస్థితి వచ్చిందన్నారు. ప్రజలుఓటుకు నోటుకు అమ్ముడుపోకుండా నిజాయితీగా ఉన్ననాడు నా నిర్ణయం ప్రకటిస్తానని అన్నారు. ప్రజల సుఖాల్లో పాలుపంచుకోకపోయినా కష్టాల్లో మాత్రం ముందుటానని అన్నారు. ఎప్పుడూ నా ఊరూ.. నా ప్రజలే తప్ప మరో ధ్యాస ఉండదన్నారు. నాయకులు పెండెం సూర్యప్రకాస్, చింతా వెంకటేశ్వర్లు, గిడ్ల చంద్రరావు, కాపగంటి ఉమాశంకర్, మల్లాడి శామ్యూల్, కోన కొండాబు, కర్రి చిట్టిబాబు తదితరులు మల్లాడి సేవా ప్రస్థానం గురించి వివరించారు. ఈసందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విందులో మల్లాడి అభిమానులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జనసేన గ్రామశాఖ అధ్యక్షుడిగా రాందాస్

అంబాజీపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఇరుసుమండ గ్రామశాఖ అధ్యక్షుడిగా సుంకర రాందాస్ నాయుడు నియమితులయ్యారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, యువత అధ్యక్షుడు అరిగెల సూరిబాబు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

మండపల్లి ఆలయంలో భక్తుల సందడి



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తజనం బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,13,218 ఒకరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ల



ఎమ్మెల్యేకు చిత్రపటం అందిస్తున్న విద్యార్థి

రాయవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీసాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ద్యాసం వెంకట సాయి త్రివిక్రమ్, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటం గీచి శనివారం ఆయనకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మల్లిడి ఆదిరెడ్డి, లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి, టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సతీష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ

కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలపై సీఐటీయూ నిరసన

మండపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ మండపేటలో శనివారం సీఐటీయు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలని సీఐటీయు జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం అమిత్‌షా వ్యాఖ్యలను అమె తప్పుబడుతూ ఖండించారు. సీఐటీయు నాయకురాలు కృష్ణవేణి, కొమరపు నరేంద్రకుమార్, బంగారు కొండ, లోవరాజు, అప్పారావు, రమేష్, సత్యనారాయణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవపై ప్రశంసలు

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెం వద్ద శనివారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మోటార్ సైకిలిస్టు గాయపడ్డాడు. ఆ సమయంలో అటువైపు వెళుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాహనం ఆపి గాయపడిన వ్యక్తిని పరామర్శించారు. తన కాన్వాయ్‌లోని కారులో ఎక్కించి ఊబలంక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులను అప్రమత్తం చేశారు. సకాలంలో వైద్యం అందించే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవను పలువురు ప్రశంసించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

యువతకు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తి

మండపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నేటి తరాలకు గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ మార్గదర్శి అని మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు అన్నారు. మండపేట ఎంపీఎస్ పాఠశాలలో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఎంపీఎస్ పాఠశాల నిర్వాహకుడు వల్లూరి చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, గణేష్, మార్నాల రాంబాబు, అప్పాబత్తులు నాగేంద్ర రామాచార్యులు, కె.శుభశ్రీ, వెదురిపర్తి సౌమ్య, బట్టు పావని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న విద్యార్థుల వినూత్న ప్రదర్శన

కపిలేశ్వరపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు శనివారం రామానుజన్ సంఖ్య ను వినూత్న రీతిలో ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు గణిత మేధావి రామానుజన్ సంఖ్య 1729 ఆకారంలో కూర్చుని దాని ప్రత్యేకత వివరించారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రమాదేవి, పి.జి.టి వాడ్రేవు శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు శ్రీహరి, బాలు, తదితర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



మాచర ఉన్నత పాఠశాలలో 1729 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



గంగవరం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

కేంద్ర హోంమంత్రిని పదవి నుంచి తొలగించాలి

కె.గంగవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రిని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. కె.గంగవరం ప్రధాన కూడలిలో నిరసన ప్రదర్శన చేశారు. మాలమహానాడు నాయకుడు రవ్వా భూషణం ఈ సందర్భంగా మాట్లాడారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కోటి వెంకట్రావు, బత్తుల అప్పారావు తదితరులతో పాటు, రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, భారత కార్మిక సంఘాల సమైక్య నాయకులు చింతా రాజరెడ్డి, జైభీమ్ సంక్షేమ సేవా సంఘం నాయకులు గుబ్బల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు శ్రీనివాస్

కె.గంగవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ కె.గంగవరం మండల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం కె.గంగవరంలో జరిగింది. యూటీఎఫ్ సీనియర్ నాయకుడు దాసరి శ్రీనివాస్ దీనికి అధ్యక్షతన జరిపారు. ఎన్నికల అధికారిగా రెడ్డి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా సిద్దాల రవి, ప్రధాన కార్యదర్శిగా గణేష్, ఉపాధ్యక్షులుగా బి. గోపాలకృష్ణ, ఏ. లక్ష్మీసౌభాగ్య, కోశాధికారిగా శివ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ. నాగరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్ కుమార్, ప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



మాట్లాడుతున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

ఓటు హక్కు వజ్రాయుధం

కొత్తపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పేర్కొన్నారు. శనివారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్ళు నిండిన విద్యార్థు లంతా ఓటుహక్కు నమోదు చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఆర్ఐ రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.అంకంరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, సీహెచ్ నాగారాణి, వి.నాగదీపిక, విజయ్‌కుమార్, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

కొత్తపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు శనివారం కొత్తపేట సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ డి.జీవనాథం, అడ్వకేట్ వై.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ర్యాంపుల్లో అక్రమాలపై కలెక్టర్‌కు వివరిస్తున్న దృశ్యం

బుకింగ్ లేకుండా ఎగుమతులు

సామాన్యులకు ఉచిత ఇసుక అందడం లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుక అందడం లేదంటూ జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. శనివారం ఆత్రేయపురం ప్రధాన కాలువ వద్ద సంక్రాంతి పడవ పోటీల ట్రోఫీ ఆవిష్కరణకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం బయటకు వస్తున్న వారికి స్థానికులు ఇసుక సమస్యను వివరించారు. ఆత్రేయపురం, వద్దిపర్రు, నార్కెడిమిల్లి, పులిదిండి, అంకంపాలెం, ఇసుక రీచ్‌లు, కాంట్రాక్టర్ల నిర్వహణలో ఉచిత ఇసుక అందించాల్సి ఉంది. ఆయా ర్యాంపుల్లో నిర్వాహకులు రోజూ లారీలను ముందుగా పెట్టుకుని తమకు ఇసుక అందించడం లేదని సామాన్యులు, లారీ డ్రైవర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్లు సొంత లారీలతో ఇసుక ఎగుమతి చేసుకుని మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ర్యాంపుల వద్ద సీరియల్ ప్రకారం రోజుల తరబడి వేచి ఉన్నా 25 లారీలకు మాత్రమే ఇసుక లోడింగ్ నిర్వహిస్తున్నారని నిర్మాణదారులు పేర్కొన్నారు. ఆత్రేయపురం ఇసుక రీచ్‌లో కూలీలకు పనులు కల్పించడం లేదని ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వకపోవడంతో పస్తులుంటున్నామని కూలీలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఇసుక రీచ్‌ల్లో వారు సాగిపోతున్న దందాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నిర్మాణదారులు వేడుకున్నారు.



రాయవరం మండలం కూర్మాపురం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు శెట్టి



కె.గంగవరం మండలం పాణింగపల్లి రెవెన్యూ సదస్సులో వినతిపత్రం ఇస్తున్న రైతులు



కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

పాత రికార్డులనే కొనసాగించాలి

రెవెన్యూ సదస్సులో రైతుల వినతిపత్రం

కె.గంగవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన భూ సర్వేను రద్దు చేయాలని, పాత రికార్డులు కొనసాగించాలని పాణింగపల్లి రైతులు డిమాండ్ చేశారు. శనివారం పాణింగపల్లి గ్రామంలో తహశీల్దార్ బండి మృత్యుంజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మొత్తం భూ సర్వే రద్దు చేయాలని, పాత రికార్డులు కొనసాగించాలని కోరుతూ రైతులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జమ్మ, గ్రామ కార్యదర్శి కామేశ్వరరావు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని పది గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. మండలంలోని కూర్మాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు ఐపీ శెట్టి పాల్గొన్నారు. రైతుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ'

ఎమ్మెల్సీ తోట

మండపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనపై వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలు పేరిట ఇచ్చిన హామీలు నేటి వరకు అమలు జరగలేదన్నారు. ఉచిత బస్సు హామీ ఊసే లేదన్నారు. ఉచిత ఇసుక ముసుగులో దోపిడి జరుగుతోందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు పట్టాభిరామయ్య, రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.



అయోడిన్ లోపంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అయోడిన్ లోపంపై అవగాహన

ఆలమూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపం వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయని ఆలమూరు ఇనిస్ట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఐటీసీ ఆధ్వర్యంలో మండలంలో బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ఆలమూరు మండలం పినపళ్ల, ఆలమూరు, జొన్నాడ గ్రామాలలో బుర్రకథ రూపంలో దీనిపై అవగాహన కల్పించారు. అయోడిన్ సరైన మోతాదులో తీసుకోవాలని లేనిపక్షంలో అనేక సమస్యలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్.సునీత, ఎఎన్ఎంలు, ఆశావర్కులు పాల్గొన్నారు.

బలమైన పునాదులతోనే మంచి ఫలితాలు

ముమ్మిడివరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను సమర్థ వంతంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసేందుకు ఉద్దేశించిన జ్ఞానజ్యోతి ప్రోగామ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు త్వరలో ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ బొజ్జ రమణశ్రీ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల19న డీఆర్‌పీలకు ప్రారంభమైన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా రమణశ్రీ మాట్లాడుతూ జ్ఞాన ప్రకాష్, పూర్వ ప్రాథమిక పాఠశాలలో జ్ఞానజ్యోతి అమ లుకానున్నట్లు తెలిపారు. జ్ఞానజ్యోతి ప్రోగామ్‌లో భాగంగా జనవరి మొదటి వారం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని 124మందికి మూడు రోజులు ఆరుగురు కేఆర్‌పీలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డీఆర్‌పీలు చేసిన డీఎల్ఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమావేశంలో ఎంఈవో-2 రాయుడు ఉదయభాస్కరావు, కెఆర్‌పీలు జె.కళావతి, విజయశ్రీ, నోడల్ సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్‌లో తప్పిదాలు సరిదిద్దాలి

తహశీల్దార్, రిజిస్ట్రార్‌లకు వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గరిగిపాటి తదితరులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ పద్ధతుల్లో తప్పిదాలు సరిదిద్దాలని మాజీ ఏఎంసీ ఛైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, జీవీ చౌదరి తదితరులు శనివారం తహశీల్దార్, రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు అందించారు. రామచంద్రపురం, ముచ్చుమిల్లి రెవెన్యూ గ్రామాల భూములు రామచంద్రపురం అర్బన్ మార్కెట్ విలువలో కలసిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్టు పేర్కొన్నారు. రిజిస్టర్ కార్యాలయాల్లో కార్డు విధానం రాకముందు రామచంద్రపురం రెవెన్యూ గ్రామం భూములు రామచంద్రపురంలోను, ముచ్చుమిల్లి రెవెన్యూ భూములు ముచ్చుమిల్లి ఇండెక్సులో రిజిస్ట్రేషన్లు జరిగేవన్నారు. ప్రస్తుత నూతన కార్డు విధానంలో సదరు గ్రామాల వ్యవసాయ భూములు రామచంద్రపురం రిజిస్ట్రేషన్ కార్డులో రామచంద్రపురం గాను, ముచ్చుమిల్లి రిజిస్ట్రేషన్ కార్డులో ముచ్చుమిల్లిగాను రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుంటు నాన్ అగ్రికల్చర్ భూములుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవలసి వస్తున్నదని పేర్కొన్నారు. వీటి తప్పులు సరిదిద్దాలని కోరారు.



సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పనుల రికార్డులు పరిశీలిస్తున్న పీడీ మధుసూదనరావు

ప్రజలకు ఆమోదయోగ్య పనులే నిర్వహించాలి

డ్వామా పీడీ మధుసూదనరావు

కపిలేశ్వరపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఆమోదయోగ్య పనులే నిర్వహించాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, ఏపీడీ కె.సత్యనారాయణ, ఎస్ఆర్పీ వి.కనకారావు, ఏవో రాజేంద్రప్రసాద్, ఏపీవో రవికిరణ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ నివేదికల్లో పనికి హాజరుకాని వారికి హాజరు సంతకాలు, కొలతలు, మస్తర్లలో వ్యత్యాసాలు తదితర పలు అంశాలపై జరిగిన లోపాలను డీఆర్పీలు వినిపించగా వాటికి సంబంధించి రికవరీ పెట్టినట్లు పీడీ మధుసూదనరావు తెలిపారు. కార్యక్రమం లో హౌసింగ్, పంచాయతీ రాజ్‌శాఖల అధికారులతో పాటు ఆయా గ్రామాల ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వినియోగదారుల వారోత్సవాలు

రావులపాలెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా తహశీల్దారు పి.ముక్తేశ్వరరావు, వినియోగదారుల సమాఖ్య జిల్లా ఛైర్మన్ అరిగెల బలరామమూర్తి పాల్గొని వినియోగదారుల హక్కులపై వివరించారు. అనంతరం ర్యాలి నిర్వహించారు. జడ్పీ పాఠశాలలో జరిపిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో కోకోఫెడ్ ఛైర్మన్ అరిగెల బలామమూర్తితో పాటు కార్యదర్శి ఆదిత్యకిరణ్, మెర్ల శాస్త్రులు, అద్దంకి అమరేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, అధ్యాపకులు దుర్గాదేవి, రాజేంద్ర, సిద్ధార్థ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం ప్రభుత్వ కళాశాలలో వినియోగదారుల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

భక్తులతో కిటకిటలాడిన వెంకన్న ఆలయాలు

రాయవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి తులసిదళ అర్చనలు, హారతులు జరిపారు. వెదురుపాక జనార్ధనస్వామి ఆలయంలో అంగర సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంగర జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం

బెల్లపుఊట ధ్వంసం

ఆత్రేయపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలిచేరు, పేరవరంలోని సారా స్థావరాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు జరిపారు. రెండు గ్రామాల్లో 1,350 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వెలిచేరుకు చెందిన నిచ్చన్న కోళ్ళ శ్రీను వద్ద పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు విజయలక్ష్మి, రవితేజ, చిరంజీవి, అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.



రాయవరంలో డ్రైన్ పూడికతీత పనులు పరిశీలిస్తున్న దృశ్యం

డ్రైన్ పూడికతీత పనుల పరిశీలన

రాయవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాయవరం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో శనివారం డ్రైన్ పూడికతీత పనులు చేపట్టారు. వీటి పనులను పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వార్డు మెంబరు ఉండవిల్లి రాంబాబు పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో డ్రైన్‌లో పూడుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు పారిశుధ్య కార్మికులతో చెత్త, చెదారం తొలగించి మురుగునీరు పారేందుకు వీలుగా చర్యలు చేపట్టారు.

మాజీ సీఎం పుట్టినరోజు వేడుకలు

మండపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను శనివారం వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిపారు. పట్టణ పార్టీ కార్యాలయంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు నాయకుల మధ్య కేక్ కట్ చేశారు. ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పలివెల సుదాకర్ తదితరులు కూడా జగన్ జన్మదిన వేడుకలను జరిపారు. ముందుగా ఎమ్మెల్సీ తోట రాజారత్న సెంటరులో వున్న వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ ఛైర్మన్ పతివాడ నూక దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు వైసీపీ నాయకులు నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహారం వద్ద ముందుగా నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు.

ద్రాక్షారామ: మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు ద్రాక్షారామలో మాజీ ఎపిఐడిసి డైరెక్టరు వాసంశెట్టి శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ కేకు కట్ చేశారు. రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అంగర పార్టీ కార్యాలయంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేశారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు శనివారం జరిపారు. పట్టణ వైసీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.